క్లుప్తంగా

ఘనంగా రుద్రహోమం



వీరేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న రుద్రహోమం

ఐ.పోలవరం: ప్రముఖ పుణ్యక్షేత్రం మురమళ్ల శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో శనివారం ఆలయ అర్చకస్వామి పేటేటి శ్యామల కుమార్ ఆధ్వర్యంలో స్వామికి గణపతి పూజ, మండపారాధన, రుద్ర హోమం అనంతరం పూర్ణాహుతి ఘనంగా నిర్వహించారు. పరమ శివుని జన్మ నక్షత్రమైన ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని జరిగిన ఈ హోమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఎంబీబీఎస్ సీట్ల కేటాయింపు వివరాలు విడుదల

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా మొదటి సంవత్సరం ఎంబీబీఎస్ సీట్ల కేటాయింపునకు సంబంధించిన వివరాలను హెల్త్ సెక్రటేరియట్ అధికారులు శనివారం విడుదల చేశారు. ఇందిరాగాంధీ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో మొత్తం 180 సీట్లకు గాను ప్రభుత్వ కోటాకు 131, ఆల్‌ఇండియా కోటా 27, ఎన్‌ఆర్‌ఐ కోటా 22 సీట్లు కేటాయించారు. మహాత్మాగాంధీ మెడికల్ కళాశాలలో బీడీఎస్‌లో యానాం-1, పుదుచ్చేరి-31, కారైకల్-8, మాహే-2 సీట్లు లభిస్తున్నాయి. రాజీవ్‌గాంధీ కళాశాలలో యానాం-1, కారైకల్-8, పుదుచ్చేరి-33, మాహే-2 సీట్లు లభిస్తున్నాయి.

యోగా విద్యార్థుల రక్తదానం



అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో రక్తదానం చేస్తున్న యోగాశ్రమ విద్యార్థులు

అమలాపురం టౌన్: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో శ్రీస్వామి వివేకానంద యోగాశ్రమానికి చెందిన 16 మంది విద్యార్థులు శనివారం రక్తదానం చేశారు. తలసేమియా రోగుల కోసం రక్తం అవసరమవడంతో తమ విద్యార్థులు ప్రశాంత్, అనిల్, ప్రవీణ్, సుధాకర్, మధుసూదనరావు, చంటి, జనార్దనరావు, బాబి, కుమారస్వామి, శ్రీను తదితరులు రక్తదానం చేశారని యోగా గురువు డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు.

అంబులెన్స్ డ్రైవర్ల డిమాండ్లకు అంగీకారం

యానాం: 108 అంబులెన్స్ డ్రైవర్ల డిమాండ్లకు పుదుచ్చేరి ప్రభుత్వం అంగీకారం తెలపడంతో డ్రైవర్లు నిరసన విరమించారు. రోజువారీ రూ.895 ఇవ్వడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పిస్తామని సీఎం రంగసామి అంగీకరించడంతో నిరసను విరమిస్తున్నామని డ్రైవర్ల సంఘ యూనియన్ నేతలు బి.ముసలయ్య, బొడ్డు ప్రసాద్, సీహెచ్ సుబ్బారావు, బేతాళం సతీష్, రామలింగం తదితరులు శనివారం తెలిపారు.

డ్వాక్రా సంఘం అధ్యక్షురాలికి సత్కారం



ధనలక్ష్మిని సత్కరిస్తున్న డ్వాక్రా సంఘ సభ్యులు

అమలాపురం రూరల్: మండలంలోని పేరూరులో శివారు లంకతోటలో ఎంఎస్ఎస్ డ్వాక్రా సంఘం అధ్యక్షురాలిగా 22 ఏళ్ల పాటు సేవలందించి పదవీ విరమణ చేసిన పితాని ధనలక్ష్మిని గ్రూపు సభ్యులు శనివారం గ్రామంలో సత్కరించారు. సంఘం నూతన అధ్యక్షురాలిగా కుడుపూడి నూకలక్ష్మిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి యిళ్ల రమాదేవి, యోగా గురువు యిళ్ల నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు వెంకటరమణకు నివాళి



వెంకటరమణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్సీ ఎంప్లాయిస్ నాయకులు

అమలాపురం రూరల్: ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన ఉపాధ్యాయుడు నల్లా వెంకటరమణకు కామనగరువు టీచర్స్ గార్డెన్‌లో కామనగరువు ఎస్సీ ఎంప్లాయిస్ ఆధ్వర్యంలో సంతాపం తెలియజేశారు. ఈ సందర్భంగా రమణ మాస్టర్ సేవలను కొనియాడుతూ ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో జి.వెంకటేశ్వరరావు, పచ్చిమాల మోహన్, పి.బాబూరావు, బి.అప్పలస్వామి, దూరదర్శన్ మూర్తి, త్రిమూర్తులు, జి.రవి తదితరులు పాల్గొన్నారు.

ఆర్బీకేలు.. రైతు నేస్తాలు

- సొంత గ్రామాల్లోనే రైతులకు విత్తనాలు, ఎరువుల అందజేత
- వ్యవసాయ పనిముట్లతో సహా అన్నీ లభ్యం

తాళ్లరేవు: ఒకప్పుడు రైతులన్నా, వారి కష్టాలన్నా ఎవరికీ పట్టేది కాదు. అలాంటిది వారికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తుంది. రైతు పక్షపాతి అయిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారి సంక్షేమం కోసం రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారు. అవి ప్రస్తుతం దేశంలోని అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయి. వాటి ద్వారా సొంత గ్రామాల్లోనే రైతులకు అన్ని సేవలు అందుతుండడంతో రైతు నేస్తాలుగా రూపాంతరం చెందాయి.

రైతులకు ఎన్నో సేవలు

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటుచేసిన రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అనేక సేవలందిస్తున్నారు. గతంలో ఏ అవసరం వచ్చినా మండల కేంద్రంలో ఉండే వ్యవసాయశాఖ కార్యాలయానికి రైతులు వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం ప్రతి గ్రామంలోనూ ఆర్బీకేలు ఏర్పాటు చేయడం వల్ల రైతులు తమ సొంత ఊరిలోనే అన్ని రకాల సేవలు పొందుతున్నారు. ఈ కేంద్రాల ద్వారా రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల నుంచి పంట అమ్మకం వరకూ సూచనలు, సలహాలు అందిస్తున్నాయి. భూసార పరీక్షల కోసం మట్టి నమూనాలు సేకరించి ల్యాబ్‌లకు పంపిస్తున్నారు.



సుంకటరేవులో ఏర్పాటుచేసిన రైతు భరోసా కేంద్రం

తాళ్లరేవు మండలంలో ఆర్బీకేలు	21
లబ్ధి పొందుతున్న రైతులు	7,284 మంది
వ్యవసాయ పనిముట్లు పొందినవారు	105
క్రాప్ ఇన్సూరెన్స్ పొందిన రైతులు	3,158

సీసీఆర్‌సీ కార్డు ఉన్న కౌలు రైతులకు బ్యాంకుల ద్వారా రుణాల మంజూరు చేయడం, రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే రైతు భరోసా పెట్టుబడి సాయం రూ.13,500 అందేలా చేయడం, గ్రామాల్లో పొలంబడి కార్యక్రమం నిర్వహించి ఆరోగ్యవంతమైన పంటలు, ప్రభుత్వ పథకాల వివరాలను వ్యవసాయాధికారులు వివరిస్తుంటారు.



పోలేకుర్రు రైతు భరోసా కేంద్రంలో రైతులకు సూచనలిస్తున్న వీఏఏ కిరణ్మయి

అందుబాటులో ఎరువులు, విత్తనాలు



ప్రభుత్వం ఏర్పాటుచేసిన రైతుభరోసా కేంద్రాల్లోనే అన్ని రకాల ఎరువులు, విత్తనాలు సబ్సిడీపై అందజేస్తున్నారు. సీజన్లతో సంబంధం లేకుండా ఆర్బీకేల్లో అన్నీ దొరుకుతున్నాయి. మార్కెట్ ధర కంటే ఆర్బీకేల్లో ఎరువులు, విత్తనాలు తక్కువకే లభిస్తున్నాయి.

– పి.చక్రశేషారావు, రైతు, పోలేకుర్రు

ఈ-క్రాప్ బుకింగ్‌తో ఎంతో మేలు



ఆర్బీకే సిబ్బంది ఏటా ఖరీఫ్, రబీ సీజన్లో చేపట్టే ఈ-క్రాప్ బుకింగ్‌తో మాకు ఎంతో ప్రయోజనం కలుగుతోంది. ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టం వాటిల్లితే పంటల బీమా పథకం కింద నష్ట పరిహారం ఇస్తున్నారు. రైతుల కోసం కష్టపడుతున్న సీఎంకు రుణపడి ఉంటాం.

– స్వర్ణ వీర్రాజు, రైతు, చొల్లంగి పంచాయతీ

కియోస్క్‌తో ఎన్నో ప్రయోజనాలు

ఆర్బీకేలలో కియోస్క్ ద్వారా రైతులకు ఎన్నో ఉపయోగాలు ఉన్నాయి. తమకు కావాల్సిన అన్ని రకాల సబ్సిడీ ఎరువులు విత్తనాలు 48 గంటల్లోనే నేరుగా రైతులకే అందుతున్నాయి. ఆర్బీకేల ద్వారా సబ్సిడీపై ఎరువులు, విత్తనాలు, యంత్రాలు పంపిణీ చేస్తున్నారు. వ్యవసాయ పనిముట్లతో పాటు ట్రాక్టర్లను కూడా అందజేస్తున్నారు.

మార్కెట్ హబ్ ప్రారంభం



మార్కెట్ హబ్‌ని ప్రారంభిస్తున్న ఏపీ అగ్రిమిషన్ సభ్యులు రామారావు, సర్పంచ్ వెంకటరావు

అల్లవరం: గ్రామీణ వ్యవసాయ మౌలిక వసతుల కల్పనలో భాగంగా నాబార్డ్, దేవగుప్తం సొసైటీ సంయుక్తంగా రూ.24 లక్షలతో దేవగుప్తం సంత మార్కెట్‌లో నిర్మించిన మార్కెట్ హబ్‌ని ఏపీ అగ్రికల్చర్ మిషన్ సభ్యులు జున్నూరి రామారావు, సర్పంచ్ సాధనాల వెంకటరావు శనివారం ప్రారంభించారు. సర్పంచ్ వెంకటరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రామారావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులకు పెద్దపీట వేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డి.రావులపాలెం సర్పంచ్ ఉండ్రు భగవాన్‌దాస్, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, కుడుపూడి సూర్యప్రకాశరావు, కుడుపూడి అప్పారావు, సాధనాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 389 కేసుల పరిష్కారం



లోక్ అదాలత్ నిర్వహిస్తున్న రెండో అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి నరేష్

అమలాపురం టౌన్: అమలాపురం కోర్టుల ప్రాంగణంలో రెండో అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ వి.నరేష్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 389 కేసులు పరిష్కారమయ్యాయి. 27 మోటారు యాక్సిడెంట్ కేసులు, 21 సివిల్ దావాలు, 282 క్రిమినల్ కేసులు, 59 ప్రీలిటిగేషన్ పిటిషన్లు పరిష్కారమయ్యాయి. రూ.1.07 కోట్ల విలువైన కేసులు పరిష్కారమైనట్లు కోర్టు కార్యాలయం తెలిపింది. అదాలత్‌లో సీనియర్ సివిల్ జడ్జి కె.శైలజ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వి.గౌరీ శంకర్, లోక్ అదాలత్ మెంబర్లు, న్యాయవాదులు పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్టుతో ప్రజాస్వామ్యం గెలిచింది



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

- బోగస్ కంపెనీలతో రూ.371 కోట్ల కుంభకోణం
- ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్

అల్లవరం: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును సీఐడీ పోలీసులు ఆధారాలతో అరెస్టు చేయడంతో ప్రజాస్వామ్యం గెలిచిందని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. శనివారం అల్లవరం మండలం గోడిలోని ఆయన నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ మాట్లాడుతూ చంద్రబాబు బోగస్ కంపెనీలు ద్వారా స్కిల్ డెవలప్‌మెంట్‌లో రూ.371 కుంభకోణానికి పాల్పడ్డారని రుజువైందన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో చంద్రబాబు, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు, ఆయన కుమారుడి పాత్ర ఉందని ఏపీ సీఐడీ అధికారులు గుర్తించారని చెప్పారు. జీఓ ఒకలా ఉంటే, ఒప్పందం మరోలా ఉందని సీఐడీ పోలీసుల విచారణలో తేలిందన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు దీనిపై ప్రిన్సిపల్ సెక్రటరీ కూడా తన నోట్ ఫైల్‌లో రాశారని సీఐడీ పోలీసుల విచారణలో వెలుగులోకి వచ్చిందన్నారు. చంద్రబాబు, ఆయన భాగస్వాములు చేసిన అవినీతి తవ్వేకొద్దీ బయటకు వస్తుందన్నారు. తప్పు చేసిన చంద్రబాబుని ఏపీ సీఐడీ పోలీసులు అరెస్ట్ చేస్తే దత్తపుత్రుడు పవన్‌కల్యాణ్, లోకేష్ గగ్గోలు పెట్టడం హాస్యాస్పదంగా ఉందని ఇజ్రాయిల్ అన్నారు. కుంభకోణంలో వారి తప్పు లేకపోతే కోర్టులో నిరూపించుకోవాలే తప్ప, రోడ్డు ఎక్కి ధర్నాలు, రాస్తారోకోలు చేస్తే చట్టం తన పని తాను చేసుకుపోతుందని హెచ్చరించారు. ఇప్పటికైనా చంద్రబాబు తాను చేసిన తప్పులను ఒప్పుకుని ప్రజలను సంజాయిషీ కోరాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ, జిల్లా ప్రధాన కార్యదర్శి మెరికల శ్రీను, పార్టీ నాయకులు రేవు శ్రీనివాసరావు, జల్లి ఏడుకొండలు, మాకే వెంకటరమణ పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదును వేగవంతం చేయాలి

జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు

ముమ్మిడివరం: ఈ-క్రాప్ నమోదు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు సూచించారు. ముమ్మిడివరం మండలం సీహెచ్ గున్నేపల్లిలో శనివారం ఈ-క్రాప్ నమోదు ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ ఈ-పంట నమోదు వల్ల వ్యవసాయ శాఖ ద్వారా అమలవుతున్న రైతు సంక్షేమ పథకాలన్నీ వర్తిస్తాయన్నారు. ఈ నెల 15వ తేదీలోగా ఈ-క్రాప్ నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ ఎస్.ప్రశాంత్‌కుమార్, గ్రామ రెవెన్యూ, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.



ఈ-క్రాప్ నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న వ్యవయసాయాధికారి బోసుబాబు తదితరులు

సమానత్వం కోసమే విజ్ఞాన్‌జ్యోతి



విజ్ఞాన్‌జ్యోతి పథకంలో భాగస్వాములైన విద్యార్థులు

యానాం: సైన్స్ అండ్ టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథ్‌మెటిక్స్ రంగాల్లో లింగ సమానత్వాన్ని తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో తీసుకొచ్చిన విజ్ఞాన్‌జ్యోతి పథకం విద్యార్థులకు ఎంతగానో ఉపకరిస్తుందని ప్రిన్సిపాల్ టీవీఎస్ ప్రకాశరావు పేర్కొన్నారు. శనివారం స్థానిక నవోదయ విద్యాలయంలో విజ్ఞాన్‌జ్యోతి పథకానికి సంబంధించి వాటిలో భాగస్వామ్యులైన పాఠశాలలు, విద్యార్థులతో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజ్ఞాన్‌జ్యోతి పథకం ద్వారా యానాంలో 10వ తరగతి విద్యార్థులు 27 మంది, పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ఇంగ్లిష్ మీడియం పాఠశాల విద్యార్థులు 12 మంది, రాజీవ్‌గాంధీ హైస్కూల్ నుంచి 8 మంది విద్యార్థులు భాగస్వాములయ్యారన్నారు. ఉన్నత విద్యతో పాటు శాస్త్ర, సాంకేతిక రంగాల్లో వస్తున్న మార్పులు, దానికి అనుగుణంగా సిలబస్‌ను రూపొందించుకోవడం, విద్యార్థులు వారి కెరీర్‌ను మలచుకోవడం విజ్ఞాన్‌జ్యోతి పథకం ముఖ్య లక్ష్యాలని తెలిపారు. కార్యక్రమం నవోదయ విద్యాలయ కేంద్రంగా అమలు జరుగుతుందని చెప్పారు.

హోరాహోరీగా జోనల్ గేమ్స్



ఉత్సాహంగా జరుగుతున్న చెస్

యానాం: స్థానిక మెట్టకూరు జవహర్‌లాల్ నెహ్రూ ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జరుగుతున్న 2023-24 సంవత్సర జోనల్ గేమ్స్ శనివారం హోరాహోరీగా జరిగాయి. ఈ సందర్భంగా అండర్-14, 17 విభాగంలో చెస్ క్రీడలో బాలుర, బాలికల జట్లు తలపడ్డాయి. పోటీలను ప్రధానోపాధ్యాయుడు కమిడి ప్రభాకరరావు ప్రారంభించారు. మొత్తం 174 మంది విద్యార్థులు పోటీల్లో తలపడ్డారు. అనంతరం అండర్-17 ఫుట్‌బాల్ పోటీలను నిర్వహించారు. విన్నర్స్‌గా ఎస్‌టీపీపీ జూనియర్ కళాశాల, రన్నర్స్‌గా రీజెన్సీ జూనియర్ కళాశాల జట్లు నిలిచాయి. చెస్‌లో అండర్-14 బాలుర విభాగంలో యానాం పబ్లిక్‌స్కూల్, రన్నర్స్‌గా పరంపేట అంబేడ్కర్ స్కూల్ నిలిచాయని ఆర్గనైజింగ్ కార్యదర్శి పాము సత్యనారాయణ తెలిపారు.

విశ్వకర్మ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

అమలాపురం టౌన్: ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకాన్ని చేతివృత్తిదారులంతా సద్వినియోగం చేసుకోవాలని జిల్లా చేతి వృత్తుల సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణమూర్తి సూచించారు. స్థానిక జిల్లా సంఘ కార్యాలయంలో చేతివృత్తిదారులతో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చేతివృత్తిదారులకు ఈ పథకం ఎలా ఉపయోగపడుతుందో, ఎలా దరఖాస్తు చేసుకోవాలో అవగాహన కల్పించారు. ఈ పథకం ద్వారా చేతి వృత్తిదారులకు రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకూ రుణం పొందే వీలుంటుందని చెప్పారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు గున్నేపల్లి భీమశంకరం, షేక్ కరీముల్లాబాబా, దంగేటి రామకృష్ణ, కందాల సూర్యనారాయణ, ఎస్.సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులివ్వాలి

అమలాపురం రూరల్: జిల్లాలో కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు అందజేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు కోరారు. శనివారం అమలాపురం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కౌలు రైతులకు బ్యాంకు రుణాలు, రైతు భరోసా అందజేయాలన్నారు. అన్నదాతను కాపాడుకోకపోతే భవిష్యత్తులో ఆహార సంక్షోభం తలెత్తే అవకాశం లేకపోలేదని హెచ్చరించారు. రాష్ట్రంలో వేల ఎకరాల దేవాదాయ భూముల్లో కౌలు సాగు చేస్తున్న రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వడం లేదన్నారు. సీపీఎం పార్టీ జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కోనసీమ జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం సీపీఎం పార్టీ రాబోయే కాలంలో పోరాటం చేయబోతుందన్నారు.



పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు అంగ్రా మాల్యాద్రి, జిల్లా కమిటీ సభ్యులు కె.కృష్ణవేణి, జి.దుర్గాప్రసాద్, ఎస్.బలరాం, టి.నాగవరలక్ష్మి, పాము బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

దొరబాబుకు సత్కారం

అమలాపురం రూరల్: జిల్లా బీజేపీ నూతన అధ్యక్షుడిగా నియమితులైన యాళ్ల దొరబాబును అమలాపురంలోని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మానేపల్లి, అయ్యాజీ వేమ, జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా వెంకట సుబ్బారావు, జిల్లా ఉపాధ్యక్షుడు దూరి రాజేష్ శనివారం ఆయన స్వగృహంలో కలిసి శుభాకాంక్షలు తెలియజేసి సత్కరించారు.

వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తజనం



వేంకటేశ్వరస్వామి దర్శనం కోసం ఆలయ ప్రాంగణంలో బారులు తీరిన భక్తులు

అమలాపురం టౌన్: శ్రావణ మాసం ఆఖరి శనివారం కావడంతో అమలాపురం వేంకటేశ్వర స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచి స్వామి దర్శనానికి ఆలయం వద్ద క్యూ కట్టడంతో ఎదురుగా ఉన్న 216 జాతీయ రహదారి సైతం భక్త జనంతో కిటకిటలాడింది. ఆలయ ప్రధాన అర్చకుడు పెద్దింటి లక్ష్మీనరసింహాచార్యులు, వేద పండితులు పాణింగపల్లి సూర్యనారాయణాచార్యులు బ్రహ్మత్వంలో స్వామికి పంచామృతాభిషేకాలు, విశేష పూజలు జరిగాయి. అనంతరం సుదర్శన హోమం, అన్నదానం నిర్వహించారు. ఆలయ చైర్‌పర్సన్ దూడల వెంకట విరీతాదేవి, పట్టణ వైఎస్సార్ సీపీ యువజన కమిటీ అధ్యక్షుడు ఫణి దంపతుల ఆధ్వర్యంలో ధర్మకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు సేవలందించారు.

శస్త్రచికిత్సకు ఆర్థిక సాయం

రావులపాలెం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి శస్త్రచికిత్సకు స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సమితి సభ్యులు శనివారం ఆర్థిక సాయం చేశారు. గ్రామానికి చెందిన దూనబోయిన నాగేశ్వరరావు ఒక హోటల్‌లో సర్వర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ నెల ఒకటిన తన పని ముగించుకొని ఇంటికి వెళ్లే దారిలో హైవే దాటుతుండగా రోడ్డు ప్రమాదం జరిగింది. కుడి కాలికి గాయమైంది. మడమ విరిగి నడవలేని స్థితిలో ఆస్పత్రిలో చేరిన నాగేశ్వరరావుకు శస్త్రచికిత్స కోసం వైద్యులు రూ.లక్ష వరకూ ఖర్చవుతుందని తెలిపారు. ఈ ఆపరేషన్‌కు ఆరోగ్యశ్రీలో కవరేజ్ లేకపోవడంతో అతని కుటుంబసభ్యులు స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సమితి సభ్యులను సాయం చేయాలని కోరారు. దీంతో శస్త్రచికిత్స నిమిత్తం సంస్థ తరఫున రూ.10 వేలు, సేవా సమితి సభ్యుడు, ఎస్‌వీ ఈవెంట్స్ అధినేత కొప్పూరి ధర్మారెడ్డి తన పుట్టినరోజు సందర్భంగా రూ.5 వేలు మొత్తంగా రూ.15 వేలు నగదు సాయంగా అందజేశారు.

పేద కుటుంబాలకు ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న జేవీఎల్ నరసింహారావు తదితరులు

ముమ్మిడివరం: పూర్వ విద్యార్థులు సమకూర్చిన సొమ్ముతో పేద కుటుంబాలకు ఆర్థిక సాయం చేశారు. తానేల్లంకకు చెందిన గోదశి చంటబ్బాయికు రూ.7,500లు, అద్దాల రాంబాబుకు రూ.6 వేలు ఆర్థిక సాయం శనివారం అందజేశారు. కార్యక్రమంలో చప్పిడి లక్ష్మణరావు, శ్రీరామచంద్రమూర్తి, చింతలపాటి మస్తాన్‌రాజు, యల్లమిల్లి సింహాద్రి, వెలపల్లి సోంబాబు తదితరులు పాల్గొన్నారు.

తల్లీబిడ్డల అదృశ్యంపై కేసు

ఉప్పలగుప్తం: మండలంలోని చీకట్లపాలేనికి చెందిన తల్లీబిడ్డల అదృశ్యంపై కేసు నమోదుచేసినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం జి.వెంకటరమణ తన భార్య ప్రమీల, కుమారుడు సాత్విక్‌తో కలిసి చీకట్లపాలెంలో నివాసముంటున్నారు. ఈ నెల 8వ తేదీ శుక్రవారం ఉదయం ప్రమీల తన పుట్టింటికి వెళతాననడంతో ఆమెను, కుమారుడిని రామచంద్రపురం పంపించేందుకు అమలాపురంలో ఆర్టీసీ బస్టాండ్‌లో ద్విచక్ర వాహనంపై దించారు. ప్రమీల తమ ఇంటికి చేరలేదని ఆమె సోదరుడు తెలియజేయటంతో వెంకటరమణ ఆమె ఆచూకీ కోసం గాలించి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పరామర్శ

అమలాపురం రూరల్: మాతృ వియోగంతో బాధపడుతున్న అఖిల భారత సీఐటీయూ ఉపాధ్యక్షురాలు గోసంగి బేబీ రాణి కుటుంబ సభ్యులను సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు శనివారం పరామర్శించారు. గున్నేపల్లి అగ్రహారంలో బేబీ రాణి తల్లి సూర్యకాంతం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నేడు ఆస్పత్రి భవనం ప్రారంభం

ఆలమూరు: స్థానిక మెయిన్‌రోడ్డులో సుమారు రూ.కోట్లతో నిర్మించిన ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి (సీహెచ్‌సీ) భవనాన్ని ఆదివారం ప్రారంభించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని భవనాన్ని ప్రారంభించనున్నారన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలన్నారు.

పర్యావరణాన్ని సంరక్షించుకోవాలి

సఖినేటిపల్లి: సఖినేటిపల్లిలంక జెడ్పీ ఉన్నత పాఠశాల తెలుగు పండిట్, ఏపీ నేషనల్ గ్రీన్ కోర్ రాజోలు క్లస్టర్ కోఆర్డినేటర్ గుండేపల్లి ప్రభావతి విశాఖపట్నంలో నిర్వహించిన పర్యావరణ సంరక్షణ శిక్షణ తరగతులకు హాజరయ్యారు. ఎకో ఇండియా, ఏపీ నేషనల్ గ్రీన్ కోర్ (ఎన్‌జీసీ) సంస్థలు సంయుక్తంగా ఈ శిక్షణ తరగతులు నిర్వహించాయి. వివరాలను ఆమె శనివారం మీడియాకు తెలిపారు. ఎకో ఇండియా సంస్థ అధినేత్రి దీపా ఝా, ఏపీ నేషనల్ గ్రీన్ కోర్ డైరెక్టర్ స్రవంతి, స్టేట్ కో ఆర్డినేటర్ నీలకంఠ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. పర్యావరణాన్ని కాపాడుకోవడానికి సంబంధించిన అనేక అంశాలపై తమకు శిక్షణ ఇచ్చినట్టు ప్రభావతి తెలిపారు.



విశాఖపట్నంలో ఎకో సంస్థ, ఏపీ ఎన్‌జీసీ ప్రముఖులతో క్లస్టర్ కోఆర్డినేటర్ ప్రభావతి